రాష్ట్ర డైరెక్టర్ జనరలాఫ్ పోలీస్ చెప్పాడు ఉపాధ్యాయ గారితో. "నేరస్తుల గురించి గాలింపు ఉద్ధృతం చేశాం సర్. . . ఇప్పటికి అందించిన సమాచారాన్ని బట్టి రేన్సమ్ కోసం మిమ్మల్ని కిడ్నాప్ చేయబోయారని అర్థమౌతూంది. . ."

బయట కారిడార్‌లో నిలబడ్డ కృషితోబాటు ఇంటికి తిరిగి వచ్చిన ఉపాధ్యాయ ఆ రోజు ప్రతి నిముషమూ జరిగిన సంఘటన గురించే మాట్లాడారు.

పూర్తిగా కోలుకున్న విశ్శుని ఇంటికి రప్పించాక కృషిని పరిచయం చేశారాయన. "ఇక నుంచి మనకి రక్షణగా విశ్వనాథ్ ఇక్కడే వుండబోతున్నాడు"

కృషి అర్థం కానట్టు చూసింది. . . ఓ సెమినార్‌లో కలిసిన విశ్శు కాకతాళీయంగా ఉపాధ్యాయగారికి దగ్గర కావటాన్ని ఆమె అంగీకరించినా అతడ్ని బాడీ గార్డ్‌లా ఆలోచించడం నచ్చలేదు. "అంత కావాలనుకుంటే పోలీస్ సెక్యూరిటీ ఏర్పాటు చేయొచ్చు గ్రాండ్‌పా"

"నాకు కావల్సింది జీతం కోసం డ్యూటీ చేసే పోలీసుల రక్షణ కాదు. ఏ స్వార్థం లేకుండా ప్రాణాలు సైతం పెట్టుబడి పెట్టగలిగే విశ్వనాథ్ లాంటి యువకుడు"

ఒక నిర్ణయం తీసుకున్న గ్రాండ్‌పాని ఒప్పించడం గాని మార్చడం గాని సాధ్యంకాని పని.

ఓ శాసనంలా అనేసి తన గదికేసి వెళ్ళిపోయిన గ్రాండ్‌పాని చూస్తూ నౌకరు శరభయ్యతో చెప్పింది విశ్వనాథ్‌కి ఓ గది ఏర్పాటు చేయమని.. . .

అసలిదంతా ఆమెకు విచిత్రంగా వుంది. . .

తనతో పోరాటానికి ఛాలెంజ్ చేసిన వ్యక్తి యిప్పుడు తన కళ్ళ ముందు తన ఇంటిలోనే వుండబోతున్నాడు.

హుందాగా చిరునవ్వుతో సోఫాలో కూర్చున్న విశ్శు మీద పూర్వం అభిప్రాయం ఏదయినాగాని అతడు తీసుకున్న రిస్క్‌కి కృతజ్ఞతలు తెలపాలనుకుంది. "థేంక్స్ విశ్శు"

"దేనికి"

"ప్రాణాలకి తెగించి తాతయ్యని కాపాడినందుకు" నవ్వాడు

"దేనికి నవ్వుతున్నావు" అడిగింది కృషి.

"కాపాడడం అనే ప్రసక్తి రావాల్సింది నిజంగా అక్కడికి టెర్రరిస్టులంటూ వచ్చినప్పుడు"

"మరి" విస్మయంగా చూసింది.

"ఇదంతా నా పథకం కృషి. అసలు నేను ఆ సంఘటన సృష్టించింది కేవలం మీ తాతయ్య పరిచయం కోసం మాత్రమే. కాని ఇప్పుడు కోటలో పాగావేసే అవకాశాన్ని కలిగించాడు మీ గ్రాండ్‌పా"

షాక్ తిన్నట్టుగా వుండిపోయింది కృషి.

"నేను నమ్మను"

ఇప్పుడు విశ్వ షాక్ తిన్నాడు “అదేం”

“ఇదంతా నువ్వు చేయించిందే అయితే నీకీ గాయాలు ఎలా అయ్యాయి”

మృదువుగా నవ్వాడు తేరుకుంటూ “అందమైన అమ్మాయిని కలుసుకోవాలని గోడ దూకి వెళ్ళే అబ్బాయిలకి ఒక్కోమారు గాయలవుతూంటాయి కృషి ఇదీ అలాంటిదే - నీకు దగ్గర కావాలీ అంటే ముందు నీ తాత పరిచయం కావాలి . . . అది కూడా చాలా పకడ్బందీగా జరగాలి . . . దానికోసం నేనే గాయం చేసుకున్నాను. అయినా ఆడపిల్లల కోసం హత్యలు సైతం చేయడం ఆనవాయితీ అయినప్పుడు ఈ మాత్రం రిస్క్ తీసుకుంటేనేం?”

“నువ్వు ఒట్టి శాడిస్టువే అనుకున్నాను.”

“ఇప్పుడు మెసోచిస్ట్‌వి కూడా అని తెలిసిపోయిందా” ఎదుటి వ్యక్తి మీద కసి తీర్చుకోలేని ఉన్మాదంలో ఒక్కోమారు తనను తాను గాయపరుచుకునే మెసోచిజం గురించి వివరిస్తున్నట్టుగా అన్నాడు “నేనేమిటీ అన్నది ఇప్పటికైనా నీకు అర్థమైనందుకు సంతోషంగా వుంది.”

“ఇప్పుడు నేనేమిటో కూడా నీకు తెలియచెప్పబోతున్నాను విశ్వా. . . ” అవహేళనగా నవ్వింది కృషి.

“అంటే నేను ఓ పథకం ప్రకారం ఈ లోగిలిలో అడుగుపెట్టానని మీ తాతయ్యకి చెప్పడం కోసం ప్రయత్నిస్తావేమో కదూ. . . కష్టం కృషీ” నిర్లక్ష్యంగా చూశాడు విశ్వా. “ఎందుకంటే నిన్ను నేను రేప్ చేస్తానని మీ తాతయ్యకి నువ్వు చెప్పినా నమ్మడు. అలా కోపంగా చూడకు. అంత కాన్ఫిడెన్స్‌తో వున్నారాయన. ఒకవేళ నీ మీద నేను అఘాయిత్యం చేసానని నువ్వన్నా నిజమో కాదో నిరూపించడానికి మెడికల్ సర్టిఫికెట్ తీసుకురమ్మంటాడే తప్ప. . .”

“మిస్టర్ విశ్వనాథ్” క్రోధారుణ నేత్రాలతో చూసింది కృషి. విశ్వ దేనికైనా సిద్ధపడగలడని ఎప్పుడో ఊహించింది కాని ఇలాంటి ప్రమాదకరమైన మూర్ఖత్వాన్ని సైతం ప్రదర్శించగలడని ఇప్పుడు అర్థం చేసుకుంది. “ఏం సాధించాలని ఇలాంటి వలయంలో అడుగుపెట్టావో నాకు బోధపడటం లేదు.”

చిన్మయానందంగా నవ్వేడు “ఒక్కటే కృషి నీతో అనుభవం అనే ఆలోచనలు అంటించిన అగ్నికి మండే సమిధనయిన నేను అవసరమైతే ఆ సుఖం కోసం కాలిపోతాను. కాలుతూ సైతం రగులుతున్న నీ నిమ్నోన్నతాల నగరాని తలుచుకుంటూ నా వేలి కొనల స్పర్శతో నీ ఒంటిని విద్యుద్వీణగా మార్చుతాను. నీ యవ్వనం ఆవలి తెలి నురుగుల హోరుతో తడిసిపోతాను. నా అదిరే పెదవుల నిశ్శబ్దం కోలాహలాన్ని కుంచెగా మార్చి కోర్కెల సిత పత్రంపై ఊపిరి లిపిని రాసి నువ్వు కసిగా గొంతులో దాచుకున్న హాలాహలంగా నయినా మిగిలిపోతాను . . . ఆ తర్వాత నీ మనసు ఎన్ని కవచాల్ని అడ్డం పెట్టుకుంటేనేం - నొక్కి పెట్టిన నీ నవ్వులోనూ కనులలోనూ - ఎక్కుపెట్టిన నీ గుండెల్లోనూ దాగుంటాను. . . నీ కళ్ళలో కాంక్షల్లోనే కాక ఆదమరిచి నిదరోయే నీ చెక్కిలిపై తారాడే కలల నీడల్లోనూ నేను కనిపిస్తూనే వుంటాను-

“షటప్”

"ఏం ఆడపిల్లవి నువ్వు. . . ఇంత అద్భుతమైన భావుకతతో మాట్లాడానే . . . కొద్దిగా నైనా రియాక్టు కావేం?"

విశ్నులో నిర్భీతి ఆమెకు భరింపశక్యంగా లేదు. "గుడిలో దేవుడి ఆభరణాల్ని దొంగిలించాలని వచ్చిన వాడు దేవుడ్ని స్తుతిస్తే అది భక్తి అనిపించుకోదు విశ్నూ . . . నీ మాటలకి స్పందించే సగటు ఆడపిల్లని కాను నేను. . . వెళ్ళి ఒక్క రాత్రయినా ప్రశాంతంగా నిద్రపో."

రేపు నువ్వీ భవంతిలో ఎలాగూ వుండవని చెప్పడం ఆమె వుద్దేశ్యం.

"అయితే నడు"

"ఎక్కడికి"

"ఒక్క రాత్రి ప్రశాంతంగా నీ బెడ్ రూంలో గడపటానికి"

ఏమిటి ఇంత ధైర్యంగా మాట్లాడుతున్నాడు. అసలు గ్రాండ్‌పా అయినా అంత సులభంగా ఇతడ్ని ఎలా నమ్మగలిగాడు?!

"ఏమిటి కృషీ ఇంకా ఆలోచిస్తున్నావేం" ఆమెను మరింత రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాడు.

"ఒకనాడు నాతో పందెంలో నువ్వోడితే నువ్వు నా ఇంటి వాచ్‌మెన్‌గా వుండాలని అడిగాను గుర్తుందా విశ్నూ" నిశ్చలంగా అంది ఆమె. "ఇప్పుడు ఈ ఇంట్లో బాడీ గార్డులా అడుగుపెట్టినా నువ్వు వుండేది ఆ స్థాయిలోనే. . . అది జ్ఞాపకం పెట్టుకొని మేం దయదలిచి యిచ్చిన గదిలో సెటిల్‌కా. కనీసం ఒక్క రాత్రి" మరోసారి 'ఒక్కరాత్రి' అన్న పదాన్ని ఒత్తి పలికి తన గదివేపు నడిచింది.

అరనిముషం తర్వాత నౌకరు శరభయ్య ఏర్పాటు చేసిన గెస్ట్‌రూంలో అడుగు పెట్టిన విశ్ను ప్రశాంతంగా వుండలేకపోయాడు.

కృషి పట్టుదలేమిటో అప్పటికే అతడికి అర్థమైపోయింది. కనీసం కొన్ని రోజులపాటు కృషి నుంచి తనను తాను కాపాడుకోవాలి. . .

అతడు ఆలోచన తప్పుకానట్టుగా ఆ రాత్రి పది గంటలకి కృషి ఫోన్ చేసిందెక్కడికో. . .

ప్రొడిక్టివిటీ కౌన్సిల్ సెమినార్‌లో జరిగిన సంఘటనకి కారణం బయటనుంచి వచ్చినవాళ్ళా లేక హాల్లోని వ్యక్తులెవరయినా అలాంటి ఏర్పాటు చేసారా అన్న విషయాన్ని తెలుసుకోమని ఆమెకు పరిచయమున్న ఏ.సి.పి. మాధుర్‌ని హింట్ చేసింది-

ఆ సందర్భంగా విశ్వనాథ్ మీద తనకున్న అనుమానాన్ని వ్యక్తం చేయటానికి వెనుకాడలేదు.

0 0 0

ఉదయం ఎనిమిది గంటల సమయం. . .

డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్న ఉపాధ్యాయ సమక్షంలో నౌకర్లందరూ క్రమశిక్షణగల

పనివాళ్ళుగానే భావించే ఉపాధ్యాయగారు వాళ్ళ ముందు మనసారా నవ్వటాన్ని సైతం ఇష్టపడరు అందుకే ఆయన ఇంట్లో వున్నంత సేపూ యంత్రాల్లా పని చేసుకు పోతుంటారంతా.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్?"

ఆయనకి సమీపంలో కూర్చున్న కృషి బ్రేక్‌ఫాస్ట్ చెయ్యకుండా ఏదో అడగాలని సంశయిస్తున్నట్టు అర్థమైంది - నిజానికి కృషికి నిన్న రాత్రి కూడా సరిగ్గా నిద్ర పట్టలేదు... విశ్వ గురించి ఓ పక్క వివరాలు సేకరించమని పోలీసుల సహాయాన్ని అర్థించినా ఒక సువిశాల సామ్రాజ్యాధినేతలా బ్రతికే గ్రాండ్‌పా విశ్వ మీద వున్నట్టుండి అంత అభిమానాన్ని ప్రదర్శించడం ఆమెకు నచ్చడం లేదు. ఆ విషయాన్నే చర్చించాలను కుంటూంది.

ఏ రోజూ కృషితో సైతం ఆత్మీయంగా మాట్లాడే అలవాటు లేని ఉపాధ్యాయ బ్రేక్‌ఫాస్ట్ చేయబోతూ హఠాత్తుగా గుర్తుకొచ్చినట్టు "విశ్వనాథ్ ఏడీ" అన్నారు.

కృషి జవాబుని ఆశించనట్టు అతడ్ని పిలవమని నౌకరుని పురమాయించారు - మరో అర నిముషంలో వచ్చాడు విశ్వ అక్కడికి - ఆ ఉదయమే ఆశ్రమం నుంచి సూటుకేస్ తెప్పించుకుని విశ్వ అప్పటికే కాలకృత్యాలు ముగించుకుని డ్రెస్ చేసుకొని వున్నాడు.

అదికాదు కృషిని ఆశ్చర్య పరిచింది. నుదుట బొట్టుతో ఇప్పుడే పూజా కార్యక్రమాలు ముగించుకొని వచ్చిన భక్తుడిలా అనిపిస్తున్నాడు.

"బ్రేక్‌ఫాస్ట్ చెయ్" అధికారం ఆత్మీయతల్ని కలిపి ఆదేశంలా అన్నారు ఉపాధ్యాయ . . . వెంటనే టేబుల్ దగ్గర కూర్చోలేదు విశ్వ.

"క్షమించండి - మీ పక్కన కూర్చునే స్థాయి కాదు నాది " అవసరానికి మించిన బిడియాన్ని, భయాన్ని నటిస్తున్న విశ్వ ఆ క్షణంలో ఉపాధ్యాయని ఎంత ఆకట్టుకున్నదీ ఆమె గమనిస్తూనే వుంది.

"మీరు మరీ తప్పదంటే మీరు లేచాక కూర్చుంటాను."

గొంతులో సైతం అసాధారణమైన వినమ్రతని, అణకువని అభినయిస్తున్నాడు.

ఇక రెట్టించలేదు ఉపాధ్యాయ. . . ఏ వ్యక్తయినా తన ముందు అలా ప్రవర్తించడమే ఇష్టమైనట్టు మృదువుగా నవ్వారు. వెంటనే "నీకు ప్రతిరోజూ పూజ చేయడం అలవాటనుకుంటాను."

"నేను దేవుడ్ని నమ్ముతాను సర్. . . ఎందుకంటే" కళ్ళల్లో టన్నుల కొద్దీ భక్తి పారవశ్యాన్ని నింపుకుని మాట్లాడుతుంటే మంటగా చూసిందే తప్ప అతడ్ని నిలదీయ లేకపోయింది ఆమె. "అసలు ఆ దేవుడి దయ లేకపోతే మీ స్థాయి వ్యక్తికి నేను దగ్గరయ్యేవాడ్ని కాదు కాబట్టి. . . నిజానికి ఇప్పటికీ జరిగింది నేను నమ్మలేకపోతున్నాను - ఇది ఏ పూర్వజన్మ సుకృతమో కాకపోతే గుడిసెలో వుండాల్సిన నేను ఈ గుడిలో అడుగు పెట్టడమేమిటి?"

"రేర్ చైల్డ్" అభినందనగా చూసారు ఉపాధ్యాయ "అసలు ఈ కాలంలో ఇలాంటి యువకులు తారసపడటం . . . ఏమంటావ్ కృషి."

గొంతు దిగనట్టు పొలమారింది కృషికి - ఏం జరుగుతూంది. . . విశ్వ ఇంతింత్తై వటుడింత్తై అన్నట్టు గ్రాండ్‌పా దృష్టిలో అలా ఎదిగిపోతున్నాడేం. . ."యస్ గ్రాండ్‌పా"... ఓరకంట విశ్వని చూసింది. "నిజమే ఈ కాలంలో ఇలాంటి యువకుడుండటం చాలా అరుదైన విషయం".

"మీ అభిమానం కాని. . ." ఆధ్యాత్మికంగా నవ్వేడు విశ్వ. "ఇదంతా మీ మనసుల్లోని నిర్మలత్వమేగా - అవును మేడమ్. ప్రపంచం కనిపించేది చూసే కళ్ళను బట్టి అన్నది నా నమ్మకం. నమ్మకమేమిటి నిజం కూడా . . . మీరు నన్ను ద్వేషిస్తే ఇప్పటి నా ప్రవర్తన నటనలా వుంటుంది. అభిమానిస్తే వినమ్రతగా కనిపిస్తుంది"

ప్రశాంతంగా నవ్వేరు ఉపాధ్యాయగారు. ఎప్పుడూ వ్యాపారానికి చెందిన ఫైల్స్‌తో లాభనష్టాల చిట్టాలతో కొత్త ప్రొజక్టుల గురించి చేసే ఆలోచనలతో సతమతమయ్యే తనకి విశ్వతో చర్చ చాలా రిలీఫ్‌గా వుంది. అదొక్కటే కాదు - నిన్న వేదికపై వ్యాపారానికి చెందిన ప్రాక్టికల్ ఫిలాసఫీ మాట్లాడిన విశ్వ ఇప్పుడు ఇంకో డైమన్షన్‌లో కనిపిస్తున్నాడు. చాలా చదివితే తప్ప ఆ వయసులో యింతటి విజ్ఞానాన్ని సంపాదించడం కష్టమైన పని. "చాలా చదివాననుకుంటాను" అడిగారు ఉపాధ్యాయగారు.

తల వంచుకున్నాడు విశ్వ బిడియంగా.

"నిజమే గ్రాండ్ పా" ఉక్రోషాన్ని అదిమి పెట్టుకుంటూ అంది కృషి. "చాలా చదివిన వాడిలా కనిపిస్తున్నాడు . . . చెప్పండి విశ్వనాథ్ గారూ. . . ఇంతవరకూ ఏమేం చదివారు. . . సిగ్గుపడకుండా చెప్పండి."

క్షణంపాటు కృషి కళ్ళలోకి చూసి దృష్టిని మరల్చుకున్నాడు. లోలోన కృషి ఎంత మండిపోతూందో అర్థమౌతూనే వుంది. "ఎంత చదివినా ఇంకా చదవాల్సింది చాలా వుందన్న సత్యాన్ని మాత్రమే తెలుసుకున్న నేను ఏం చదివానని చెప్పమంటారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని తెలియచెప్పే అద్వైత్వాన్ని, ఏకత్వంలో భిన్నత్వం గురించి వివరించే ద్వైతాన్నీ చదివాను. వేదాలు, ఉపనిషత్తులతో బాటు రామాయణ భారతాల వంటి కావ్యాలు, యుస్కెఫీ ప్రచురణలూ చదువుతుంటాను."

విభ్రమంగా అడిగింది "యుస్కెఫీ ప్రచురణలంటే"

"సమాజంలో విషబీజాలను నాటే సెక్సు గురించి, నేరాల గురించి, సంఘ విద్రోహక చర్యల గురించి రాయబడుతూ పసిపిల్లల మనసుల్ని ఛిన్నాభిన్నం చేసే చెత్త సాహిత్యానికి కలతచెంది ఓ ధర్మసంస్థ విడుదల చేస్తున్న ప్రచురణలవి. . . "

"నేను అడిగింది యుస్కెఫీ అంటే ఏమిటి అని."

"యునైటెడ్ సోషల్ కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా (USCEFU). తెలుగులో అయితే భారతీయ ఆధ్యాత్మిక సాంస్కృతిక విద్యా ధర్మ సంస్థ"

విశ్వ అంతటితో ఆగిపోలేదు. . . చాలా ఆవేశంగా తన బాధని ప్రకటించాడు. "భారతీయ

లేనటువంటి ప్రచార సాహిత్యం మూలంగా జంతు ప్రాయంగా మారుతున్న పిల్లల్ని, నేటి యువతని కాపాడాలీ అంటే మన ప్రాచీన విజ్ఞానం గురించి, దేశ భక్తి గురించి, మంచి నడత గురించి తెలియచెప్పే మరెన్నో గ్రంథాల్ని యుస్కెఫీ ప్రచురించాలని కొరుకుంటున్నాను."

ఇంకా మాట్లాడేసేవాడే. . .చప్పట్లు వినిపించాయి. . . వెనక్కి తిరిగిన విశ్శు అప్పుడు చూసాడు డాక్టర్ మహంతిని.